పాపులర్ రచనలు చేయటం ఎలా?

యండమూరి వీరేంద్రనాథ్

(క్రిందటిసంచిక నుంచి తరువాయి)

శైలి

రాము ఆమె చెయ్యి అందుకున్నాడు. "పోదాం పద" అంది ఆమె. ఇద్దరూ నడవటం ప్రారంభించారు. ఎటు వెళుతున్నారో ఆమెకి అర్థం కాలేదు.

"మనం ఎటు వెళుతున్నాం?"

"అదే నేనూ అడుగుదామనుకుంటున్నాను" అన్నదామె.

అతడు జేబులోంచి ఖరీదైన సిగరెట్ తీసి వెలిగించాడు "ఆ సిగరెట్ ధర ఎంతో నీకు తెలుసా?" గుండెల్నిండా పొగపీల్చాడు.

"తెలియదు" అన్నాడతను.

"ఎందుకంత ఖర్చు పెట్టి సిగరెట్లు తాగుతావ్?" అన్నదామె.

పై పేరాగ్రాఫ్ మళ్ళీ ఇంకొకసారి చదవండి. విషయం అర్థమైనా అందులో కొంత కన్ఫ్యూజన్ కనపడుతుంది. ఈ కన్ఫ్యూజన్‌కి కారణం రచయితకి తన శైలి పట్ల ఒక అవగాహన లేకపోవటమే.

అతను సిగరెట్ తీసి వెలిగించుకున్నాడు. 'ఈ సిగరెట్ ఖరీదెంతో తెలుసా?' అని తర్వాత వాక్యముంది. అంటే పాఠకులకి అతనే సిగరెట్ తీస్తూ ప్రశ్న అడిగినట్లు అనిపిస్తుంది. ఆ తర్వాత సమాధానం, ఆమె ఇచ్చినట్లు పాఠకుడు భావిస్తాడు. దానియొక్క వివరణని రచయిత తర్వాత ఇచ్చాడు. కానీ ఏ వ్యక్తితో వాక్యం మొదలు పెడితే, ఆ తర్వాతి సంభాషణ ఆ వ్యక్తి తాలూకుది అని పాఠకుడు అనుకుంటాడు. ఇది రచయిత చేసిన చిన్న తప్పు.

రచయిత అనుభవజ్ఞుడైతే ఈ 'చిన్న' తప్పుల్ని కూడా సరిదిద్దుకుంటాడు. దీనికి ఉదాహరణ పై సంభాషణలో మొట్టమొదటి వాక్యం. రాము ఆమె చెయ్యి అందుకున్నాడు. "పోదాం పద" అన్నదామె - అన్న వాక్యంలో కూడా రచయిత యొక్క అనుభవరాహిత్యం తెలుస్తుంది. అందుకున్నది రాము అయినప్పుడు 'పోదాం పద' అన్న వాక్యం అతనిదేమో అని పాఠకులకి వెంటనే అనిపిస్తుంది. ఆ తర్వాత వచ్చిన 'అన్నదామె' అన్న పదాల వల్ల ఆ సంభాషణ స్త్రీ అన్నదని తెలిసినా కూడా, క్షణకాలం పాఠకుల్లో ఒక సందిగ్ధత ఏర్పడుతుంది. అనుభవజ్ఞుడైన రచయిత ఈ చిన్న సందిగ్ధాన్ని కూడా పాఠకుల మనసులో ఉంచటానికి ఇష్టపడడు. అతడు ఈ విధంగా వ్రాస్తాడు.

రాము సాచిన చెయ్యి అందుకుని పైకి లేస్తూ "పోదాం పద" అన్నదామె. ఇద్దరూ నడవటం ప్రారంభించారు.

అతడు జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించటం చూసి " ఆ సిగరెట్ ఖరీదెంతో తెలుసా?" అని అడిగింది.

అతడామె వైపు చిత్రంగా చూస్తూ "ఎందుకూ?" అన్నాడు.

"ఎందుకిలా సిగరెట్లు తాగటం?" అన్నదామె.

....సులభమైన శైలి ఈ విధంగా ఉంటుంది.

శైలి - ప్రాముఖ్యత

నవల స్త్రీలాంటిదయితే దాని ప్రారంభం 'వదనం'లాంటిది. మొహాన్ని చూసి మనిషి మీద అభిప్రాయం కలిగినట్టుగానే, ప్రారంభం చదవగానే ఆ రచన మీద ఒక అభిప్రాయం కలుగుతుంది.

ప్రారంభం వదనం అయితే, ఫ్లాట్ వెన్నెముక లాంటిది. అది మొత్తం ఆకారాన్ని సూచిస్తుంది.

పాత్రపోషణ ఆ అమ్మాయి యొక్క ప్రవర్తనలాంటిది. అది ఆమె మీద గౌరవాన్ని పెంచుతుంది.

చివరగా.....

శైలి ఆమె నడ(వడి)క లాంటిది. నిరంతరం అది పాఠకుడ్ని తనతోపాటు నడిపిస్తుంది. అందువల్ల రచనకి శైలి చాలా ముఖ్యం. కథాంశం ఎంత బాగున్నా, పాత్ర పోషణ ఎంత గొప్పగా ఉన్నా, కథలో నాటకీయత ఎంత ఉన్నా కూడా - శైలి బాగోలేకపోతే పాఠకుడూ రచనని చదవడు.

ప్రతీ వాక్యం సజావుగా సాగిపోతూ ఉండాలి. అది పాఠకుడ్ని తనతోపాటు తీసుకువెళ్ళాలి.

దీని గురించిన వివరాలు మరిన్ని చర్చిద్దాం

భాష

రచయితకి భాష చాలా ముఖ్యం. మారుతున్న రచనా పద్ధతుల్లో భాష యొక్క ప్రాముఖ్యత తగ్గిపోయిందని చాలామంది భావిస్తున్నారు. కానీ అది తప్పు. అల్లసాని పెద్దనలాగా, ముక్కు తిమ్మనలాగా వ్రాయనవసరం లేదు. కానీ భాష మాత్రం స్వచ్ఛంగా, రచనానుగుణంగా, స్పష్టంగా ఉండాలి. పాపులర్ రచనకి కూడా ఇది చాలా అవసరం. లేకపోతే ఎంత మంచి నవల వ్రాసినా, డిటెక్టివ్ స్థాయిలో ఉండిపోతుంది.

రచయిత తప్పనిసరిగా తప్పుల్లేకుండా వ్రాయటం నేర్చుకోవాలి. భాషా దోషాలు ఎడిటర్లని చాలా ఇబ్బంది పెడతాయి. మనం పంపించిన స్క్రిప్టులని సబ్ - ఎడిటరు ఎంత దిద్దినా భాషా దోషాలు ఎక్కువయ్యే కొద్దీ వారిలో విసుగు ఎక్కువవుతుంది. వ్రాతప్రతిని చదివే ఎడిటర్‌కి ఇలాంటి తప్పులు ఎక్కువగా కనపడితే 'తెలుగే సరిగ్గా వ్రాయటం చేతకాని ఈ రచయిత నవలేం వ్రాస్తాడు? మరికొంత నేర్చుకోనియ్' అని విసుగ్గా ఆ ప్రతిని పక్కన పడేస్తాడు. పెద్ద బాలశిక్ష నుంచి కనీస వ్యాకరణం వరకు రచయిత చదివి ఉండాలి. ప్రతి రచయితా తన దగ్గిర ఒక శబ్ద రత్నాకరాన్నో, నిఘంటువునో ఉంచుకోవటం తప్పనిసరి.

ఇటీవలి కాలంలో కొంతమంది రచయితలు గొప్పగొప్పగా పదాడంబరాల్నీ, అలంకారాల్నీ, అర్థంలేని సమాసాల్నీ సృష్టిస్తూ పాపులర్ నవల వ్రాయటానికి ప్రయత్నిస్తున్నారు. ఇది కొంతవరకూ ఆచరణ యోగ్యమే అయినా, ఒక నవల పాపులర్ కావటానికి అంత పదాడంబరం అవసరం లేదు. అదీకాక, తెలిసీ తెలియని ప్రయోగాలు చేస్తే విజ్ఞులైన పాఠకులు మనసులో నవ్వుకునే అవకాశం కూడా ఉంది. కాబట్టి వాటి జోలికి పోకపోవటమే మంచిది. ఈ తప్పు ఒక్కోసారి నేనూ చేస్తూ ఉంటాను.

బాధ, భాధ, భాద ఇలాంటి చిన్న చిన్న పదాల్లో కూడా చాలామంది తప్పులు వ్రాస్తుంటారు. తెలియని పదాలు వాడకపోవటమే చాలావరకు ఉత్తమం. ఒక్కోసారి తెలిసిన పదంలో కూడా తప్పులు వ్రాయటం జరుగుతుంది. అటువంటప్పుడు, భాష బాగా తెలిసిన వాళ్ళతో ఒకటి రెండూ ప్రతులు దిద్దించుకుంటే మనం ఏయే తప్పులు చేస్తున్నామో భాషాపరంగా తెలుస్తుంది.

దేముడు (దేవుడు) అపస్రద (అపస్రథ), తిమ్మెర (తెమ్మెర)లాటి తప్పుడు భాష వ్రాస్తున్నానని నాకు పాతిక నవలలు వ్రాసే దాకా తెలీదు.

కర్త, కర్మ, క్రియ

అతడికి దెబ్బ తగిలిన తర్వాత తెలిసింది తనకాలు రాయికి కొట్టుకుందని. చేత్తో రాయిని వంగి పట్టుకుని తీసాడు. కోపం వచ్చింది ఆ రాయి మీద. విసిరేశాడు దూరంగా, బలంగా. చీకట్లోకి అది అదృశ్యమైపోయింది. రక్తం మాత్రం స్రవిస్తుంది కాలినుంచి.

ఇది మంచి శైలి కాదు. పాఠకుడిని చాలా ఇబ్బంది పెట్టే శైలి. మొత్తం అంతా చదివితే భావం అర్థం అయ్యేలా చెప్పటమే కాదు - పాఠకుడి మెదడుని ఇబ్బంది పెట్టకుండా, చెప్పదలచుకున్న భావాన్ని, క్లియర్‌గా చెప్పటం కూడా రచయిత బాధ్యతే. పై సంఘటననే అతి సాధారణంగా, చాలా మామూలుగా ఈ విధంగా వ్రాయవచ్చు.

అతడి కాలికి దెబ్బ తగిలింది. వంగి చూస్తే రాయి. అతడికి కోపమొచ్చింది. ఆ రాయిని చేత్తో తీసుకుని బలంగా చీకట్లోకి విసిరేశాడు. కాలినుంచి రక్తం స్రవిస్తూనే ఉంది.

పై ఉదాహరణకీ క్రింద ఉదాహరణకీ తేడా ఏమీటంటే, పై ఉదాహరణలో రచయిత ఇంగ్లీష్‌లో ఆలోచించి తెలుగులో వ్రాశాడు. క్రింది ఉదాహరణలో తెలుగులో ఆలోచించి తెలుగులో వ్రాశాడు.

ఇంగ్లీష్‌లో "Rama killed Ravana" అని ఉంటుంది.

దాన్ని ఇంగ్లీష్‌లో ఆలోచించి తెలుగులో వ్రాయటం అంటే "రాముడు చంపాడు... రావణుడిని"

తెలుగులో ఆలోచించటం అంటే "రాముడు రావణుడిని చంపాడు" అని. వర్ధమాన రచయితల వ్రాతప్రతులు మా దగ్గరికి వచ్చినప్పుడు, ఈ విధమైన శైలిని గమనిస్తూ ఉంటాము. కర్త, కర్మ, క్రియ సరిగ్గా వ్రాస్తే భాషకి లాలిత్యమూ, సరళత్వమూ వస్తుంది. చాలామంది లబ్ధప్రతిష్టులైన రచయితలు కూడా ఒక రకమైన సంక్లిష్టతతో వ్రాయటాన్ని మనం ప్రస్తుత పత్రికల సీరియల్స్‌లో గమనించవచ్చు. ఇదంతా ఇంగ్లీష్ ప్రభావమే.

ఇంగ్లీష్‌లో మరొక లక్షణం కూడా ఉంది. "Adverb" లన్నీ క్రియలకు సంబంధించినవి "Adjectives' అన్నీ నామవాచకాలకు సంబధించినవీ అయ్యి - అవి వాక్యాల్లో వేరు వేరు ప్రదేశాల్లో చొప్పించబడతాయి. తెలుగులో ఆ విధంగా కాదు. ఈ క్రింది వాక్యాన్ని గమనించండి.

"అరవై ఏళ్ళ వయసున్న ఒక సైనికాధికారి, పాతికేళ్ళ క్రితం యుద్ధంలో పాల్గొన్నవాడు, ఇప్పుడు ఒక అందమైన అమ్మాయి ప్రేమలో పడటాన్ని ఏమాత్రం తప్పుకాదు అని భావించటానికి కారణం ప్రేమ కూడా ఒక యుద్ధంలాటిదే అని ఏనాడో విజ్ఞులు చెప్పిన సత్యం."

ఎంతో గొప్ప భావం ఇది. రచయిత ఆ భావాన్ని పాఠకులకి అందచేయటంలో కృతకృత్యుడు కాలేకపోయాడు. దీనికి కారణం - అతడు ఇంగ్లీషులో ఆలోచించి తెలుగులో వ్రాయటమో, లేక చెప్పదలచుకున్న విషయం పట్ల ఎక్కువ విశ్లేషణాలు చేర్చి, తను కంగారు పడి, పాఠకుల్ని గందరగోళం పెట్టటమో జరిగింది.

ఈ వాక్యం ఇంగ్లీషులో ఏ మాత్రం క్లిష్టత లేకుండా చాలా మామూలుగా ఉంటుంది.

A Sixty year old army colonel, who had participated in a war twenty five years back, has now fallen in love with a beautiful girl which he does not feel wrong because "love" is also a war according to intellectuals.

ఈ అందమైన భావాన్ని ఎంత క్లుప్తంగా చెబితే అంతగా పండుతుంది.

"పాతిక సంవత్సరాల క్రితం యుద్ధంలో పాల్గొన్న ఒక సైనిక అధికారి, అరవై ఏళ్ళ వయసులో ఒక అందమైన అమ్మాయి ప్రేమలో పడితే ఏమాత్రం తప్పులేదు. కారణం, ఏనాడో విజ్ఞులు చెప్పారు. "ప్రేమ కూడా ఒక యుద్ధంలాంటిదే" అని.

ఈ విధంగా వాక్యాల్ని చిన్నవిగా విడగొట్టటం ద్వారా వాటికి రమ్యత చేకూర్చవచ్చు. అలా అని పెద్ద పెద్ద వాక్యాలు ఉండకూడదని కాదు. ఒక వేళ పెద్ద వాక్యాలున్నా కూడ, అవన్నీ పైన చెప్పిన విధంగా కర్త, కర్మ, క్రియ పద్ధతుల్లోనే ఉండాలి తప్ప ప్రతి దానికీ ఒక విశేషణాన్ని చేర్చకూడదు.

"కోణార్క్ ఎక్స్‌ప్రెస్, తనే కోణార్క్ శిల్పంలా జనంతో కిటకిటలాడుతున్న సికింద్రాబాద్ స్టేషన్‌లో, హుందాగా, అప్పుడే ఎలక్షన్స్ గెలిచిన రాజకీయ నాయకుడిలా నిలబడి ఉంది."

ఇందులో ఇన్ని విశేషణాలు కావాలా? గమనించండి. ఆ తరువాతి కథకి గానీ - కోణార్క్ శిల్పానికి గానీ.... సికింద్రాబాద్ స్టేషన్ ఎలా ఉన్నదన్న విషయానికి గాని - ఏ సంబంధమూ లేకపోతే ఈ వాక్యానికి పట్టిన స్పేస్ మరో "అవసరమైన" వాక్యం కోసం ఉపయోగించుకోవచ్చు కదా! ఇంత అయోమయం ఎందుకు?

రెండోసారి చదవటం

అయోమయం పోవటానికి అన్నిటికన్నా బెస్ట్ పద్ధతేమిటంటే ఒక పేజీ వ్రాయగానే దాన్ని గట్టిగా చదవటం. అలా చదవటం ద్వారా ఏ మాత్రం క్లిష్టత ఉన్నా రచయితకి తెలిసిపోతుంది.

ఇలా రెండోసారి చదవడం వలన తప్పులు కూడా తెలిసే అవకాశం ఉంది. ఉదాహరణకి ఇటీవలే ప్రముఖ వారపత్రికలో పడిన ఒక సీరియల్ ప్రారంభం చదవండి.

"వైజాగ్ బీచ్ చాలా రష్‌గా ఉంది. మాధవ్, రాధవైపే చూస్తూ కూర్చున్నాడు. రాధ తెల్లచీరలో చాలా అందంగా ఉంది. సముద్రం మీద నుంచి వస్తున్న గాలికి ఆమె ముంగురులు అందంగా ఎగురుతున్నాయి. దగ్గరగా జరిగి.... అతడు ఆమె చేతిని సుతారంగా అందుకున్నాడు." (వాళ్ళిద్దరి మధ్యా కొంత సంభాషణ వ్రాసింది రచయిత) ఆ తరువాత నవల ఇలా సాగుతుంది.

"సూర్యుడు సముద్రంలోనికి దిగిపోవడం వలన అక్కడ బాగా చీకట్లు అలుముకున్నాయి. మాధవ్ ఆమె భుజాల చుట్టూ చేయి వేశాడు. రాధ అతనివైపు తమకంగా చూసింది. అతడిక ఆవేశం ఆపుకోలేక ఆమెని దగ్గరగా తీసుకుని బలంగా పెదవుల మీద ముద్దుపెట్టుకున్నాడు. వారిద్దరూ ఆవేశం ఆపుకోలేకపోయారు. బీచ్ నిర్మానుష్యంగా ఉంది. అతడు ఆమెని అలానే పొదవి పట్టుకుని చాలాసేపు ఉండిపోయాడు...."

ఈ నవలలో కథ విశాఖపట్టణంలో జరిగినట్లుగా వ్రాయబడింది. ఇందులో ముఖ్యంగా రెండు తప్పులు దొర్లాయి.

ఒకటి: సాయంత్రం జనంతో కళకళలాడుతున్న బీచ్ సూర్యుడు కొద్దిగా సముద్రంలోనికి దిగిపోగానే నిర్మానుష్యమయిపోయిందా?

రెండు: విశాఖపట్టణం సముద్రం తూర్పున ఉంది కాబట్టి సాయంత్రం సూర్యుడు అందులో కృంగిపోతాడా?

వ్రాసింది రెండోసారి చదువుకోకపోవటం వలన వచ్చిన ఇబ్బంది ఇది. ఇలాంటి ఇబ్బంది వారం వారం సీరియల్ వ్రాసి పంపేటప్పుడు కూడా వస్తూ ఉంటుంది. పత్రికాఫీసుకి వ్రాతప్రతి ఇవ్వడానికి టైమ్ దగ్గర పడటంతో మరల రెండోసారి చదవడానికి వీలవక ఇలాంటి తప్పులు దొర్లుతుంటాయి.

ఈ ధారావాహిక మొదటిభాగం, మొదటి అధ్యాయంలో "ప్రారంభం" అన్న నాలుగు పేజీలు (మొదటి కథ) ఒకసారి చదవండి. అందులో మూడు తప్పులున్నాయి. వాటిని గుర్తించగలరా? మిమ్మల్ని పరీక్షించుకోండి. (మీ పరిశీలనా శక్తికి ఇదో చిన్న పరీక్ష)

ఒక్కొక్కసారి మనకి చాలా గొప్పగా కనబడ్డ అంశమే కొన్ని రోజుల తర్వాత తిరిగి చదువుకుంటే పేలవంగా అనిపించవచ్చు. రెండోసారి చదవడం వలన ఈ ప్రమాదాన్ని కూడా అధిగమించడానికి వీలవుతుంది.

సీరియల్ ప్రచురణ అవుతున్న సమయంలో పాఠకుల దగ్గర్నుండి రచయిత చేసిన తప్పులు, ఉత్తరాల రూపేణా వస్తుంటాయి. వాటిలో చాలా భాగం రచయిత తాను వ్రాసింది రెండోసారి చదువుకోకపోవడం వలన జరిగే తప్పులే.

ఈ అజాగ్రత్త ఒక్కోసారి ఎంతవరకూ దారి తీస్తుందంటే పాత్రల పేర్లు కూడా మారిపోతుండవచ్చు. ఇలాంటి తప్పులు నా సీరియల్స్‌లోనూ కొన్నిసార్లు జరిగాయి. ఇది క్షమించరాని నేరం.

భాష ప్రసక్తి వచ్చింది కాబట్టి మరో విషయం కూడా ఇక్కడ చర్చించుకుందాం. తెలంగాణా ప్రాంతం నుండి కథలు పంపించేవారు. ‘కళ్ళుకి‘ బదులు ‘కల్లు‘ అనీ, ‘వెళ్ళాను‘ బదులు ‘వెల్లాను‘ అని వ్రాస్తూ ఉంటారు. మాండలికం వ్రాయడం వేరు. భాషలో తప్పులు వ్రాయడం వేరు. ఈ విషయం కూడా రచయితలు సరిచూసుకోవాలి. పత్రికల్లో సాధారణంగా ప్రచురించబడే కథలు తూర్పుగోదావరి, కృష్ణలాంటి కోస్తా ప్రజల భాషలో ఉండటం ఇక్కడ గమనించవచ్చు. వీలైనంతవరకూ పాపులర్ రచనలన్నీ ఈ రకమైన శైలిలో వ్రాయడం మంచిది. మాండలికలో నవల వ్రాస్తే కేవలం ఆ ప్రాంతం ప్రజలకే అర్థం అవుతుంది కాబట్టి పూర్తిగా పాపులర్ అయ్యే అవకాశం లేదు.

చాలామంది వర్ధమాన రచయితలకు ‘EDITOR’ స్పెల్లింగ్ తెలియదు. పత్రికాఫీసులకు వచ్చే ఉత్తరాలపై ‘ADITOR’ అని వ్రాసి ఉండటం నేను చాలాసార్లు గమనించాను. దాదాపు పదిశాతం కథలపై ఇలా ఉంటుందంటే మీకు ఆశ్చర్యం కలుగుతుందేమో.

వచ్చే సంచికలో.. రిపిటేషన్